నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

బుధవారం
22 జనవరి
2025
పేజీలు 8

గుంటూరు
పల్నాడు


# పైసామీదే ధ్యాస పనితీరుపై కాదు



పట్టణంలోని కొత్తపేటలో పాత ప్రభుత్వ ఆస్పత్రి వెనుక రోడ్డుపై చెత్త కుప్పలు

**కొనసాగుతున్న శానిటరీ ఇన్స్పెక్టర్ల అవినీతి పరంపర**
**చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు**

**తెనాలి, మేజర్ న్యూస్**

పట్టణంలో శానిటరీ ఇన్స్పెక్టర్ల పనితీరు అందరూ ముక్కున వేలేసుకునేలా ఉంది. పారిశుధ్య కార్మికుల హాజరు మొదలు పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్న వాహనాల ఆయిల్ వరకు వివిధ రీతుల్లో తమ దందా కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పని మీద కంటే పైసా వసూళ్లపైన ఎక్కువ ధ్యాస నిలిపి ఏ రూపంలో వసూళ్లు కొనసాగించాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు ఇన్స్పెక్టర్లు ఉన్నతాధికారుల హెచ్చరికలను సైతం లెక్క చేయకుండా వసూళ్ల దందా కొనసాగిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తన పర్యటనలలో పారిశుధ్య మెరుగుదలకు ఇస్తున్న సలహాలను, సూచనలను సైతం వీరు పెడచెవిన పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ చైర్ పర్సన్ తరచూ ఆయా వార్డుల్లో పర్యటించిన సందర్భాల్లో చేస్తున్న సూచనలను వీరు లెక్కచేయడం లేదు. బదిలీల కోసం పెద్ద మొత్తం చెల్లించి ఇక్కడకు వచ్చామని ఇక్కడ చూస్తే అందుకు తగ్గ రాబడిలేదని అధికారుల ముందే కొందరు తమ అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల జరిగిన బోసు రోడ్డు విస్తరణ పనులు, ఆ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఆ సమయంలో సంబంధిత సానిటరీ ఇన్స్పెక్టర్లు విధుల్లో లేకపోవడం వీరి పనితీరుకు అద్దం పడుతుంది. ఓ శానిటరీ ఇన్స్పెక్టర్ ఉన్నతాధికారుల ముందస్తు సమాచారం ఇవ్వగా మరో ఇన్స్పెక్టర్ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తన వ్యక్తిగత పనిపై ఊరు వెళ్లడం పని నిర్వహణపై వీరికున్న శ్రద్ధ ఏపాటిదో అర్థమౌతుంది. ఆ మరుసటి రోజు మంత్రి మనోహర్ తన కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించి ఇన్స్పెక్టర్ల పనితీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వీరి పనితీరులో మార్పులేదన్న వాదనలు ఉన్నాయి. పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య విధానమని, గ్యాంగ్ వర్కులని రకరకాల పేర్లతో పనులు చెప్పిస్తున్నామని ఫొటోలతో కాలయాపన చేస్తున్నారే తప్ప పారిశుధ్య నిర్వహణ మెరుగుపడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. పురపాలక సంఘ పరిధిలో ఆయా ప్రాంతాల్లో చెత్త కుప్పలు, అపరిశుభ్రంగా ఉన్న మురుగుకాల్వలు దర్శనమిస్తునే ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో పనిచేసే పారిశుధ్య కార్మికుల హాజరు చూసిచూడనట్లు వ్యవహరించేందుకు పెద్ద మొత్తంలో ముడుపులు అందుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కొందరు కార్మికులు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఏమీ చేయలేని పరిస్థితి ఉందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు వినియోగించే కాంప్యాక్టర్లు, ట్రాక్టర్లు, పాప్ కార్టు, జేసీబీ వంటి వాటికి సంబంధించి ఆయిల్ పంపిణీ విషయంలో ఎవరికి పోటీ పడుతూ అందినకాడికి వారు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాహనాలకు కేటాయించే ఆయిల్ ను కొందరు ఇన్స్పెక్టర్లు కోత విధిస్తుండటంతో డ్రైవర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సహకరించని డ్రైవర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పారిశుధ్య పనితీరు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చినా కొందరు ఇన్స్పెక్టర్లు ఒంటెద్దుపోకడతో వారికి సహకరించడం లేదు. దీన్ని అరికట్టడంలో ఉన్నతాధికారులు సఫలీకృతం కాలేకపోతున్నారు వాపోతున్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల వద్ద నుండి సైతం ఇంచార్జులుగా వ్యవహరిస్తున్న వారు వసూళ్లకు పాల్పడుతున్నారని

మిగతా 3వ పేజీలో



స్థానిక సుల్తానాబాద్ వద్దనున్న అలపాటినగర్ లోని మురుగు కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు



8 లో..

## కొత్త మిర్చి రాకతో గుంటూరు యార్డ్ కళకళ

ఆసియా ఖండంలోనే పేరెన్నికగన్న గుంటూరు మిర్చి యార్డ్ కొత్త మిర్చి రాకతో కళ కళ లాడుతోంది. సంక్రాంతి పండుగ ముగియటంతో రైతులు మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారు. దీంతో.రైతులతో మిర్చి యార్డు కళకళలాడుతోంది. ఈ నెలాఖరుకు రోజుకు లక్ష కు పైగా మిర్చి టిక్కీలు యార్డుకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రకాశం, పల్నాడు, కృష్ణాజిల్లాలోని కొన్ని ప్రాంతాల నుంచి యార్డుకు మిర్చి తరలివస్తున్నట్లు చెబుతున్నారు. ఒక్క మంగళవారమే సుమారు లక్ష టిక్కీలకు పైగా మిర్చి యార్డుకు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిర్చి ధరలో మాంద్యం ఉండటంతో ఎగుమతులకు కొంత మేరకు ఇబ్బందిగా ఉన్నట్లు తెలుస్తోంది. యార్డుకు తరలివస్తున్న మిర్చిలో ఏ రోజుకా రోజు 80 శాతానికి పైగా అమ్మకాలు జరుగుతున్నట్లు అధికారుల అంచనాలను బట్టి తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, ఖమ్మం జిల్లా నుంచి కూడా మిర్చి తరలివస్తుంది, రైతులకు ఇబ్బందులు లేకుండా యార్డ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు...

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

# పవన్ ప్లాన్ సక్సెస్..!

- టిడిపి ఎందుకు వెనక్కి తగ్గింది?
- లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవిపై గేర్ మార్చిన. తెదేపా
- ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టిన కూటమినేతలు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టాలని గత పది రోజుల నుంచి సోషల్ మీడియాలో వస్తున్న కథనాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెరదించినట్లు తెలుస్తోంది. గత రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎంలు తెదేపా నాయకులు ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని గట్టిగా ఆదేశించారు. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ విషయమై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని జనసేన నేతలను ఆదేశించారు. దీంతో సమస్య ప్రస్తుతానికి సద్దుమణిగింది. కొంతమేరకు పవన్ కళ్యాణ్ సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు తెదేపా నుంచి నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇస్తే మిగతా సామాజిక వర్గాల నుంచి కూడా ఈ పదవి కోసం కొత్త గళాలు లేవనెత్తే అవకాశం ఉందని బిజెపి, తెదేపా, జనసేన నేతలు భావించి మొగ్గ దశలోనే ఈ ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టినట్లు తెలుస్తోంది..

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

ఏపీలో సీఎం చంద్రబాబు తనయుడు, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ పార్టీ నేత రాజేష్ మహాసేన మొదలుపెట్టిన డిమాండ్ ను ఆ తర్వాత ఇతర నేతలు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, బుద్దా వెంకన్న, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎస్వీఎస్ఎన్ వర్మ అందుకున్నారు. అయితే నిన్న ఉన్నట్లుండి టీడీపీ అధిష్టానం దీనిపై స్పందించి ఈ ప్రచారానికి వెంటనే బ్రేక్ వేసింది. అయితే ఈ విషయం తెలియని మంత్రి టీజీ భరత్ దావోస్ లోనూ లోకేష్ సీఎం అంటూ వ్యాఖ్యలు చేసి సీఎం చంద్రబాబుతో తిట్లు తిన్నారు. అయితే టీడీపీ ఈ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గింది ?

రాష్ట్రంలో కూటమిగా ఏర్పడి పోటీ చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ గతంలో ఓ ఒప్పందం చేసుకున్నాయి. అధికారంలోకి వస్తే చంద్రబాబు సీఎం కావాలని, పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని, మిగతా నేతలకు

మిగతా 3వ పేజీలో

## హిందూ ఫార్మసీలో పీఎం ఇంటర్న్ షిప్ 2024-2025 ప్రారంభం




**గుంటూరు మేజర్ న్యూస్ :** స్థానిక అమరావతి రోడ్డులో గల హిందూ ఫార్మసీ కళాశాలలో ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ 2024-2025 కార్యక్రమానికి బి ఫార్మసీ విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి నాగ భూషణం తెలిపారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా నైపుణ్య శాఖ అధికారి ఆర్ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య విభాగం వారు నిర్వహిస్తున్న ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం ఎంపికైన విద్యార్థులకు సంవత్సరం పాటు ఆన్లైన్ శిక్షణ కార్యక్రమం ప్రముఖ ఔషధ సంస్థలతో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ఐదు వేల రూపాయలు చొప్పున సంవత్సరం పాటు ఉపకారం వేతనం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం పూర్తి చేసుకున్న విద్యార్థులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్ మధుసూదన్ రావు, నైపుణ్య విభాగాధిపతి ఆర్. రామకృష్ణారెడ్డి లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు, ఇంచార్జ్ అధ్యాపకులు సిహెచ్ ప్రసాద్ రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి సీతారామయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టిన ఈవో



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** పారిశుద్ధ్యం సమస్య లేకుండా సిబ్బంది కృషి చేయాలని దుగ్గిరాల గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామ సెక్రెటరీ కె. వివేకానంద సూచించారు. దుగ్గిరాల గ్రామంలో పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టి పలు వార్డుల్లోని రోడ్లను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం సమస్య లేకుండా పనిచేయాలని ఎప్పటికప్పుడు తడి చెత్తను పొడి చెత్తను ఎత్తివేస్తూ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ,నీరు నిల్వ లేకుండా పారుదల అయ్యేవిధంగా శ్రద్ధ తీసుకున్నట్లయితే దోమల బెడద ఉండదని, బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకవని తెలిపారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది తగు జాగ్రత్తలు, తీసుకుంటూ గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దాలని, అదేవిధంగా గ్రామ అభివృద్ధి కోసం ప్రజలు ఇంటి ప. న్ను లను సకాలంలో చెల్లించి, రోడ్లపై చెత్తను ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వేయకుండా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని,గ్రామ ఈవో కె.వివేకానంద గ్రామ ప్రజలకు సూచించారు..

## ఘనంగా స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని బాలి కో న్నత పాఠశాలలో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి ఆధ్వర్యంలో మంగళవారం వివేకానంద స్వామి వేడుకల నుఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థ నులకు, వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థ నులకు ప్రైజ్‌లను అందజేశారు. పాఠశాలకు చెందిన కె.పద్మావతి గెలుపొందిన విద్యార్థ నులకు ప్రైజ్‌లను మిఠాయిలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



# ఆక్రమిత ప్రాంతాల్లో నివాసాలను మార్గదర్శకాలకు లోబడి రెగ్యులైజ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశం
- మంగళగిరి- తాడేపల్లి నగర పాలక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలోని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆక్రమిత ప్రాంతాల్లోని నివాసాలు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం రెగ్యూలైజేషన్ చేసేందుకు సంబంధిత శాఖలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజతో కలసి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆక్రమిత ప్రాంతాల్లోని నివాసాల రెగ్యూలజేషన్ , ఇతర అభివృద్ధి కార్యక్రమాల పై రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, రైల్వే, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలో అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు, అభ్యంతరం ఉన్న పొరంబోకు, రహదారులు, రిజర్వ్ ఫారెస్ట్, రైల్వే, దేవాదాయశాఖ, వాటర్ బాడీస్ స్థలాల్లో రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో దాదాపు 16,025 నివాసాలు గుర్తించినట్లు అధికారులు వివరించారు. కేటగిరి వారీగా స్థలాలకు సంబంధిత శాఖల అధికారులతో స్థలాల రెగ్యూలైజేషన్ కు ఉన్న అవకాశాలు, సడలించాల్సిన నిబంధనలు , తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ సమీక్షించి సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో అక్రమిత స్థలాలు రెవెన్యూ రికార్డు ప్రకారం ఉన్న స్థలాల కేటగిరిని పూర్తి స్థాయిలో పరిశీలించి



స్థలాల రెగ్యూలజేషన్ కు సడలించాల్సిన నిబంధనలపై నివేదిక అందించాలన్నారు. కేటగిరి 1, 2 కి సంబంధించిన స్థలాల్లో నివాసాలను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తనిఖీ చేసి వచ్చే మంగళవారం నాటికి పూర్తి స్థాయిలో నివేదిక అందించాలన్నారు. రహదారులు, స్మశానాలు, రైల్వే, దేవాదాయశాఖ, అటవీ శాఖల స్థలాల్లో ఉన్న నివాసాలను సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించి నివేదిక అందించాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులందరూ తదుపరి వారంలో జరిగే సమావేశానికి నిర్దేశించిన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎంటీఎంసీ పరిధిలో యూజీడీ ట్రీట్మెంట్ ప్లాంట్, మంచినీటి పంపింగ్ ప్లాంట్ ఏర్పాటుకు, ఈట్ స్ట్రీట్ కు, స్మార్ట్ మార్కెట్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన స్థలాలు అందించటానికి సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, మానవవనరులశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఎంటీఎంటీసీ పరిధిలో అక్రమిత స్థలాల్లో నివాసాలను రెగ్యూలజేషన్ చేసేందుకు ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించటం జరిగిందన్నారు. ఎంటీఎంసీ పరిధిలో అభ్యంతరంలేని ప్రభుత్వ పోరంబోకు, అభ్యంతరం ఉన్న పొరంబోకు, రహదారులు, రిజర్వ్ ఫారెస్ట్, రైల్వే, దేవాదాయశాఖ, వాటర్ బాడీస్ లో ఉన్న స్థలాల్లో నిర్వహించిన సర్వేలో గుర్తించిన నివాసాల లబ్ధిదారుల పూర్తి వివరాలు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే సేకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వేకు సంబంధించిన స్థలాల్లో అక్రమణలపై రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా పరిషత్ సీఈఓ వి జ్యోతిబసు, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, జిల్లా అటవీశాఖ అధికారి హిమ శైలజ, డీపీఓ సాయికుమార్, సీనియర్ డీఈఎన్ (కోఆర్డినేషన్) జెవీ అనూషా, ఇరిగేషన్ ఇన్ చార్జి ఎస్ఈ వెంకటరత్నం, ఏపీపీఐఐసీ జోనల్ మేనేజరు డా. ఎంఎల్ నరిసింహారావు, రాష్ట్ర మానవవనరులశాఖ మంత్రి నారాలోకేష్ ఓఎస్డీ వరప్రసాదు, తహశీల్దార్లు సాంబశివరావు, సీతారామయ్య, దేవాదాయశాఖ ఏసీ మాధవి, ఎంటీఎంసీ డీసీపీ అశోక్ కుమార్, ఎంటీఎంసీ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా అధ్యక్షునిగా చెరుకూరి తిరుపతిరావు

**గుంటూరు మేజర్ న్యూస్ :** గుంటూరు లాల్ పురం రోడ్డునందు గల బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి సీనియర్ నాయకులు జిల్లా క్రియాశీలక సభ్యత్వం ఇన్చార్జి కొత్తూరు వెంకట సుబ్బారావు అధ్యక్షతన జిల్లా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో చెరుకూరి తిరుపతరావుని జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ ఇంచార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు జిల్లా పరిశీలకులు చిగురుపాటి కుమారస్వామి ప్రకటించారు. ఈసందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న 8 మంది ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా చెరుకూరి తిరుపతిరావును ఎన్నుకోవటం అభినందనీయమని అన్నారు. ఎంతో కాలంగా పార్టీని నమ్ముకోని పార్టీ కోసం కష్టపడి పని చేసిన తిరుపతిరావుని రాష్ట్ర పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేయటం చాలా



సంతోషకరమైన విషయం అని తెలిపారు. రాబోవు రోజుల్లో అందరిని కలుపుకొని, పార్టీని బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుపొందే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. బీజేపీ గుంటూరు జిల్లా నూతన అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జరగబోయే స్థానిక ఎన్నికల్లోనూ, కార్పొరేషన్ ఎన్నికల్లో నూ కూటమి నాయకులను, కార్యకర్తలను అందరినీ కలుపుకొని పార్టీ విజయానికి కృషి చేస్తానని అన్నారు. జిల్లా అధ్యక్షులుగా నన్ను ఎన్ను కున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈసంద ర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షులుగా నియమితులైన చెరుకూరి తిరుపతిరావును నాయకులు కార్యకర్తలు శాలువా బొకే పూలదండలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కెవి సుబ్బారావు అధ్యక్షత జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా సహ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నేరెళ్ల మాధవరావు, తియ్యగూర వెంకట కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపాటి స్వరూపరాణి, మాజీ మంత్రివర్యులు శనక్కాయల అరుణ, ఈదర శ్రీనివాసరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, కుమార్ గౌడ్, వైవి సుబ్బారావు, ఉమామహేశ్వరరావు పలువురు సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 6 నుండి శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

### గోడపత్రికలు ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు చైతన్య

**పెదకాకాని మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదకాకాని పాతూరు సెంటర్లో 22వ అఖిల భారత యువజన సమైఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరణ జరిగినది ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర యువజన సమైక్య ఏఐవైఎఫ్ మహాసభలు ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరుగుతున్నాయని తెలియజేశారు ఈ మహాసభలకు గుంటూరు జిల్లాలోని యువజన సమైక్య సభ్యులందరూ సకాలంలో హాజరై మహాసభలను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు కేంద్ర



ప్రభుత్వం ఎన్నికల ముందు యువతకు పెద్దపేట వేస్తామని రెండు కోట్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మ పలికి అధికారంలోకి రావడం జరిగిందన్నారు అలానే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ఇస్తామని నిరుద్యోగ భృతి కల్పిస్తామని నిరుద్యోగ యువతకు మాయమాటలు చెప్పి అధికారంలోకి రాగానే యువకుల్ని మోసం చేసిందన్నారు ఇప్పటివరకు ఒక ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పెండింగ్ లో ఉన్న ఉద్యోగాలు త్వరితగతిన భర్తీ చేసి తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో అఖిల భారత యువజన సమైఖ్య ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీనివాసరావుపూల మాధవరావు, ఆర్.కళ్యాణ్ శ్రీనివాస్,ఎడ్లపల్లి సాయిరాం, కటారు వంశీ, షేక్.మున్నా తదితరులు పాల్గొన్నారు.

# 26న జరిగే ర్యాలీలను జయప్రదం చేయాలి : జొన్న శివశంకరరావు



**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనవరి 26వ తేదీన జరుగు కార్మిక కర్షక ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేక అమరారెడ్డి భవన్ లో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిఐటియు, ఏఐటీయూసీ, రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, రజక వృత్తిదారుల సంఘం తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ప్రజలపై అదనపు బారాలు వేసిందని అన్నారు. అందులో భాగంగానే రైతాంగాన్ని నష్టపరిచే విధంగా అనేక చట్టాలు తీసుకురావడమే కాక, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియను అమలు చేస్తుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా జనవరి 26 75 వ ఘనతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, అన్ని జిల్లా, మండల కేంద్రాలలో కార్మిక కర్షక సమస్యలను పరిష్కరించాలని ట్రాక్టర్, బైక్ ర్యాలీ జరుగుతుందని ఆయన తెలిపారు. పంజాబ్ రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ గత 57 రోజులుగా రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరాహార దీక్ష చేస్తూ, ఆరోగ్యం క్షేనించిందని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన అన్నారు. అయినప్పటికీ రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం రైతు నేతలను చర్చలు జరపాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకే ట్రాక్టర్ బైక్ ర్యాలీని కార్మికులు కర్షకులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విధాన ముసాయిదాను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని, రుణమాఫీ చేయాలని, నూతన మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన కార్మిక, కర్షకులకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలని, విద్యుత్ సంస్కరణ బిల్లు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిఐటియు తాడేపల్లి పట్టణ నాయకులు బూరగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. అదేవిధంగా ప్రజలపై అదనపు భారాలు వేసే ట్రూ అప్ చార్జీలను ఎత్తివేయాలన్నారు. ఏఐటీయూసీ తాడేపల్లి ఏరియా నాయకులు కంచర్ల కాశయ్య మాట్లాడుతూ బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే విధంగా, రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ, దేశంలో మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు పూనుకుందని ఆయన విమర్శించారు. రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 26వ తేదీన జరుగు ట్రాక్టర్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, బి. కోటిరెడ్డి, ఈమని రామారావు, గాంధీ, భక్కి రెడ్డి, కొట్టే కరుణాకర రావు, బి దశరదారెడ్డి, దొంతి రెడ్డి విజయభాస్కర రెడ్డి, బొప్పన గోపాలరావు, పలగాని లక్ష్మీనారాయణ, ఐ ఎన్ టి యు సి నాయకులు శామ్యూల్, ఏఐటీయూసీ తాడేపల్లి పట్టణ నాయకులు తుడిమెళ్ళ వెంకటయ్య, చింత శ్రీరామ్, గంజి శ్రీను, నీరుడు దుర్గారావు, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ రాజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**పంచాయతీ రాజ్ కమిషనర్‌ని కలిసి విన్నవించిన ఉద్యోగ సంఘం నాయకులు**



**గుంటూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ కమిషనర్ ఎం. కృష్ణ తేజని వారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు సంఘం, గుంటూరు జిల్లా కార్యదర్శి పులిపాటి అమ్మయ్య, ఎపి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నేత పల్నాటి శ్రీరాములు,మర్యాద పూర్వకంగా కలిశారు. ఎపి పంచాయతీ రాజ్ శాఖ లో పలు కీలకమైన మార్పు లోకి శ్రీ కారం చుట్టిన పంచాయతీ రాజ్ కమీషనర్ కృష్ణ తేజకి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు గురించి కమిషనర్ దృష్టి కి తీసుకొని రాగా సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినారు. పంచాయతీరాజ్ శాఖలో పనిచేయచు చనిపోయిన ఉద్యోగ ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియమకము కింద ఉపాధి కల్పించడంలో,జిల్లా పరిషత్ నందు ఖాళీలు లేకపోవడం వలన గత ఐదు సంవత్సరములుగా ఒక్క గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని 100మంది దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వారికి త్వరగా ఉపాధి కల్పించవలసిందిగా కోరడమైనది. ఈ విషయమై కమిషనర్ స్పందిస్తూ వన్ టైం సెటిల్మెంట్ కింద వారి అర్హత ప్రకారము గ్రామ వార్డు సచివాలయాలలో ఉపాది కల్పించుటకు రాష్ట్ర మొత్తం మీద 900 మందికి సంబందిచి దస్త్రమును ప్రభుత్వ వారికి పంపించడం జరిగిందని అది త్వరలోనే ప్రభుత్వం ఆమోదం పొంది వాళ్ళందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినారు. 2. గ్రామ పంచాయతీ నందు గ్రేడ్స్ కు వ్యతిరేకంగా జరుగుతున్న డిప్యూటేషన్స్ గురించి ప్రస్తావించగా వాడిని త్వరలోనే రద్దు చేయుటకు చర్యలు తీసుకుంటాము అని హామీ ఇచ్చియున్నారు. 3.పం చాయతీ రాజ్ లోని వివిధ కేడర్ వాళ్ళకు సంభంది పదోన్నతు విషయం ప్రస్థావించగా సీనియరిటి లిస్టులు తయారు చేసుతన్నాము త్వరలో పదోన్నతులు కల్పిస్తాము అనితెల్పియున్నారు.

# పైసా మీదే ధ్యాస - పనితీరుపై కాదు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు ఉన్నాయి. కొందరు అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ విధులకు హాజరుకాకుండా వారిస్థానంలో ఇన్స్పెక్టర్ సహకారంతో వేరే వారిచే పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి నెలవారీ వసూళ్ల పెద్దమొత్తంలో చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు కార్మికులు విధులకు హాజరు కాకపోయినా చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆ భారం తమపై పడుతున్నదని కొందరు కార్మికులు చెబుతున్నారు. ఇటు వంటి సంఘటనలన్నీ వెరశి పారిశుధ్య నిర్వహణ కుంటుపడుతున్నది. దీనికి తోడు ఒక్క ఇన్స్పెక్టర్ రెండేసి డివిజన్లు పర్యవేక్షిస్తుండటంతో పారిశుధ్య నిర్వహణ కొరవడుతున్నాయని విమర్శలు ఉన్నాయి. పయ్యల్తనంలో రోడ్లపై చేత నిల్వలు పేరుకుపోవడం, మురుగు కాల్వల్లో చెత్త చెదారం నిండిపోతున్నాయి. దీంతో దోమల బెడద పెరిగి ప్రజలు రోగాల బారినపడుతున్నారు. దోమల నివారణ చర్యలు నామమాత్రంగానే చేపడుతూ అందులోనూ అవినీతికి పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో పారిశుధ్య మెరుగుదలకు ఉన్నతాధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు. లేకుంటే పారిశుధ్యం మరింత క్షీణించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం



పట్టణంలో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ సూచనలు, సలహాలు ఉన్నతాధికారుల సహరంతో అమలుచేస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య నిర్వహణ మెరుగవుతున్నది. నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదు.

**– డాక్టర్ కె. హెలెన్ నిర్మల, మున్సిపల్ ప్రజారోగ్య అధికారిణి**

### అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు



పారిశుధ్య నిర్వహణలో శానిటరీ ఇన్స్పెక్టర్లు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో కార్మికులు నేరుగా తమకు పిర్యాదు చేయవచ్చు. అట్టివారిపై వెంటనే చర్యలు తీసుకుంటాం.

**– బి శేషన్న, కమీషనర్**

## సీఎం కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

**కందుల వేణు వర్ధన్**



గుంటూరు, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా వచ్చిందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, తెనాలి నియోజకవర్గం తెదేపా నేత, కందుల వేణు వర్ధన్ అన్నారు మంగళవారం తెనాలి మారిస్ పేట ఆయన నివాసం వద్ద కందుల వేణు వర్ధన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విశాఖ ఉక్కు కర్మాగారం మణిహారం అన్నారు వేలాది మంది తెలుగుజాతి నాయకులు విరోచిత పోరాటాలు త్యాగాల కారణంగా విశాఖ స్టీల్ ప్లాంట్ వచ్చిందన్నారు ప్లాంట్ ను పునర్ జీవింపజేసేందుకు కేంద్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వలనే సహకారం అందిస్తుందన్నారు గత వైసీపీ ప్రభుత్వం తమ స్వార్ధ ప్రయోజనాలకు రాష్ట్రాన్ని తాకెట్టు పెట్టిందన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి ఏదో ఒక మంచి వార్తను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని తెలిపారు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రుణంతో స్టీల్ ప్లాంట్ కు పునర్ వైభవం వస్తుందన్నారు రికార్డు స్థాయిలో లాభాలు తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కందుల వేణు వర్ధన్ తెలియజేశారు.

# పవన్ ప్లాన్ సక్సెస్..!

(మొదటి పేజీ తరువాయి)

ఇతర పదవుల పంపకాలు చేసుకోవాలని వారు నిర్ణయించారు. అయితే దానికి భిన్నంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రచారాన్ని టీడీపీ తెరపైకి తెచ్చింది. అదీ లోకేష్ వర్గంగా భావిస్తున్న వారితో ఈ ప్రచారం మొదలుపెట్టింది. తొలుత నామినేటెడ్ పదవుల కోసం నేతలు ఇలా వ్యాఖ్యలు చేస్తున్నారని భావించినా చివరికి దీని వెనుక వ్యూహం ఉందని అందరికీ అర్థమైంది. వాస్తవానికి టీడీపీలో ఓ అనవాయితీ లేక సంప్రదాయం ఉంది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు తమకు అనుకూలమైన మీడియా లేదా నేతల ద్వారా జనంలోకి లీకులు ఇవ్వడం, దానిపై సానుకూలత వస్తే సదరు నిర్ణయంపై ముందుకు వెళ్లడం, రాకపోతే ఏదో కారణంతో వెనక్కి తగ్గడం ఎప్పటి నుంచో జరుగుతూనే ఉంది. ఇప్పుడు కూడా లోకేష్ ను డిప్యూటీ సీఎం చేసే విషయంలోనూ అదే జరిగిందన్న చర్చ జరుగుతోంది. అయితే ఇప్పుడు లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రచారంపై వ్యతిరేకత వచ్చింది ఎక్కడన్న ప్రశ్న ఎదురైంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏకైక డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఇప్పుడు ఉన్నట్లుండి లోకేష్ ను డిప్యూటీ సీఎం చేస్తే నష్టం కూడా ఆయనకే. గతంలో ఐదుగురు డిప్యూటీ సీఎంలు ఎలాంటి అధికారాలు లేకుండా కేవలం పేరుకే అన్నట్లు కొనసాగారు. దీంతో పవన్ ఏకైక డిప్యూటీ సీఎంగా ఉండాలనుకున్నారు. కానీ ఇప్పుడు లోకేష్ రూపంలో మరో డిప్యూటీ సీఎం వస్తే మజ్జిగ పలుచన కావడం ఖాయం. అందుకే గత కొన్నిరోజులుగా టీడీపీ నేతలు లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ ప్రచారం మొదలుపెట్టినా సైలెంట్ గా ఉన్న పవన్.. నిన్న మాత్రం తిరుపతి నేత కిరణ్ రాయల్ తో కౌంటర్ ఇప్పించారు. లోకేష్ డిప్యూటీ సీఎం కావాలని టీడీపీ నాయకులు ఎలా కోరుకుంటున్నారో, అలాగే జనసేన నాయకులు కూడా పవన్ కళ్యాణ్ సీఎం కావాలని కోరుకుంటున్నారని తిరుపతి జనసేన ఇన్ ఛార్జ్ కిరణ్ రాయల్ చేసిన వ్యాఖ్యలు ఘాటు కౌంటర్ లా మారాయి. ఈ వ్యాఖ్యల ప్రభావంతోనే టీడీపీ వెంటనే అప్రమత్తమై లోకేష్ డిప్యూటీ సీఎం ప్రచారం ఆపాలంటూ నేతలకు ఆదేశాలు ఇచ్చినట్లు లీకులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. అయితే మిగతా నేతలు సైలెంట్ అయినా విషయం తెలియని మంత్రి టీజీ భరత్ ఏకంగా దావోస్ లోనే, సీఎం చంద్రబాబు ముందే ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా లోకేష్ కాబోయే సీఎం అన్నారు. భరత్ వ్యాఖ్యల్ని పక్కనబెడితే టీడీపీ ఇలా వెనక్కి తగ్గడం వెనుక పవన్ ప్లాన్ సక్సెస్ అయిందన్న ప్రచారం జరుగుతోంది.

## టీడీపీ శాశ్వత సభ్యునిగా "ముంద్రు"



**నూజెండ్ల మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వము లక్ష రూపాయలతోతీసుకున్న మాజీ జెడ్పిటిసి సభ్యులు మరియు తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహణాధికారి అయినా ముంద్రు సుబ్బారావుని వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ గారైన జీవి ఆంజనేయులు అలాగే మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు, డి ఎల్ డి ఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, ఏపీ వెటర్నరీ కౌన్సిలర్ చైర్మన్ పారా లక్ష్మయ్య ఘనంగా సత్కరించారు.

## ధూళిపాళ్లలో పర్యటించిన ఏపీ లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మండల పరిధిలోని ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో పర్యటించారు. గ్రామంలోని చిలక చంటి,జోష్ మేరీల కుమార్తె నూతన వస్త్రాల బహూకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు అనంతరం స్థానిక నాయకులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ అవకాశాలను వినియోగించుకొని దళిత సామాజిక వర్గాలు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన పెద్దలకు సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరం




**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ఈరోజు పిడుగురాళ్ల మున్సిపాలిటీలోని 2, 3 వార్డ్ లలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు కార్యక్రమం జరిగింది. యాభై పశువులకు గర్భకోశ వ్యాధులు నివారణ, ముప్పై పశువులకు నట్టల నివారణ, రెండు వందల గొర్రెలకు,వంద మేకలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ డి.ఎస్.ఎం మోహన్ రెడ్డి, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ,పిడుగురాళ్ల. మన్నవ సాగర్ బాబు, పశుగణ సహాయకులు, సిబ్బంధి పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షునిగా శశి కుమార్



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షునిగా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఆర్యవైశ్య యువ నాయకులు యేలూరి శశి కుమార్ ను పార్టీ అధిష్టానం ఈరోజు ప్రకటించారు. శశి కుమార్ గత కొన్నేళ్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీజేపీలో సీనియర్ నాయకులుగా బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో పల్నాడు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా శశి కుమార్ తన బాధ్యతలతో పాటు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. శశికుమార్ సేవలను గుర్తించిన బీజేపీ రాష్ట్ర అధిష్టానం, ఈరోజు శశి కుమారుకు పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షునిగా ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ నాయకులు కార్యకర్తలు శశి కుమారును అభినందించారు.

## కంది పంటలో క్షేత్ర సందర్శన చేసిన వ్యవసాయ అధికారి




**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల మండలములోని జానపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమము మంగళవారం రోజు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కంది పంటలో క్షేత్ర సందర్శన చేయడం జరిగింది. కంది పంటలో మారుకా మచ్చల పురుగు ఉధృతిని గమనించుకొని, క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ 1 లీటర్ నీటికి లేదా ఫ్లూబెండమైడ్ 50గ్రా 1 లీటర్ నీటికి లేదా కొరాజెన్ 60 మి.లీ 1 లీటర్ నీటికి కలుపుకుని పిచికారి చేసుకోవాలి అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్ శ్రీనివాస్ రెడ్డి ఏఈఓ, బి చౌదర్ రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ జన్మదిన వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు








- మంగళగిరిలో ఫ్రీ లైవ్ మ్యూజిక్ షో
- రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు

**మంగళగిరి మేజర్ న్యూస్ :** రాష్ట్ర మంత్రి మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ జన్మదిన వేడుకలకు మంగళగిరి తెలుగు తమ్ముళ్లు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాజధాని కేంద్రమైన మంగళగిరి నియోజకవర్గంలో లోకేష్ జన్మదిన వేడుకల సందర్భంగా పలు కార్యక్రమాలు ఏర్పాట్లకు తెలుగు తమ్ముళ్లు, అభిమానులు సన్నాహాలలో నిమగ్నమైయ్యారు. యువనేత నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో భాగంగా అన్నదాన, రక్తదాన కార్యక్రమాలు నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. నవులూరు ఏసిఏ క్రికెట్ స్టేడియంలో ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్, విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం జరుగనుంది. మంగళగిరి ఆటోనగర్ ఎదుట మియామి కేఫ్ ప్రక్కనే గ్రౌండ్ లో గురువారం సాయంత్రం 6గంటల నుండి ఫ్రీ లైవ్ మ్యూజిక్ షో కొనసాగనుంది. అయా కార్యక్రమాలు ఏర్పాట్లుపై టిడిపి శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాయి.

**గ్రౌండ్‌ను పరిశీలించిన ఎస్పీ సతీష్ కుమార్**

మంగళవారం సాయంత్రం గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ లైవ్ మ్యూజిక్ షో నిర్వహించనున్న ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ టీవీ రవికుమార్, నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ, పట్టణ సీఐ డి. వినోద్ కుమార్, టిడిపి నాయకులు పడవల మహేష్, గోసాల రాఘవ తదితరులు ఉన్నారు.

# శ్రమ ఆయుధమైతే విజయం బానిస : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు మేజర్ న్యూస్ :** "శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీకు బానిస అవుతుంది" అంటూ స్వామి వివేకానంద ఇచ్చిన అద్భుతమైన సందేశమే విద్యార్థులకు నిజమైన మార్గదర్శనమని శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని లక్ష్యాలను స్పష్టంగా నిర్ధేశించుకుని వాటి సాధన కోసం దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా, వరగాని గ్రామానికి చెందిన చండీప్రియ, బండారుపల్లి గ్రామానికి చెందిన శశిప్రియ బ్రాడీపేటలోని శ్రీ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. అయితే వారిద్దరికీ తల్లిదండ్రులు లేని కారణంగా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూల్, హాస్టల్ ఫీజును వారు చెల్లించలేక పోయారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు ఉషాకుమారి ద్వారా ఈ విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ తక్షణమే స్పందించి వారి ఫీజు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం శారదానికేతన్ పాఠశాలను సందర్శించిన శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులైన లేళ్ళ అప్పిరెడ్డి చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థినులకు చెరో 15వేల రూపాయల చొప్పున మొత్తం 30వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

**ప్రార్థించే పెదవుల కన్నా - సాయం చేసే చేతులు మిన్న..**

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, "ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న" అని వ్యాఖ్యానించారు. ఈ సిద్ధాంతాన్ని తన జీవన విధానంగా మలుచుకున్న బందా రవీంద్రనాథ్, ప్రధానంగా విద్యార్థులలో స్ఫూర్తి నింపితే వారే దేశమంతటా వెలుగులు విరజిమ్ముతారని నమ్మే గొప్ప మానవతావాది అని ప్రశంసించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవీయ విలువలు గల రవీంద్రనాథ్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని సొంత లాభం కొంత మానుకుని పొరుగువారి సంక్షేమానికి పాటుపడాలని కోరారు. సామాజిక స్పృహతో స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించడమే కాక తన వంతుగా నేను సైతం అంటూ ఆయన చేస్తున్న మంచి కార్యక్రమాలను మనస్ఫూర్తిగా అభినందించారు. అంతే కాక అక్కడికక్కడే శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థినులను ఉద్ధేశించి మాట్లాడుతూ, ముందరి దారి ఎలా ఉన్నా మొక్కవోని దీక్షతో గమ్యం దరి చేరాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్య ప్రాధాన్యతను గుర్తెరిగి అంకితభావంతో చదవాలని కోరారు. అత్యుత్తమంగా చదివి అత్యున్నత శిఖరాలు అధిరోహించేందుకు చిత్తశుద్ధితో మీరు చేసే ప్రయత్నాలకు స్ఫూర్తి ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, గీతా మందిరం ఛైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేరేచర్ల మస్తాన్‌వలి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, షేక్ రబ్బానీ, వెంకటరమణ, గంగాధర్ రెడ్డి, రవీంద్ర, సంజీవరెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, భాగ్యారావు, ప్రసన్న, సుశీలరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్ల నిర్మాణం : చీఫ్ విప్ జీవీ




**వినుకొండ మేజర్ న్యూస్ :** ప్రజల ప్రయోజనార్థం వినుకొండ పట్టణంలో శివశక్తి ఫౌండేషన్ తరపున తమ సొంత నిధులతో 4 ఆధునిక బస్‌షెల్టర్ల నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. అనేక సంవత్సరాలుగా బస్ షెల్టర్లు లేక పట్టణంలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడితో వారి ఇబ్బందులు తీరబోతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మంగళవారం అందుకు సంబంధించి స్థలాల పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడారు చీఫ్ విప్ జీవీ. ఇంతకాలంగా బస్ షెల్టర్లు లేక పోవడం వల్ల గ్రామాల నుంచి వచ్చినవారు, పట్టణం నుంచి ఎక్కడికైనా వెళ్లాలి అనుకునే వారు ఎంతో అవస్థపడుతున్నారని మున్సిపల్ కమిషనర్, కౌన్సిల్ తన దృష్టికి తీసుకుని వచ్చారన్నారు. ఆ మేరకు మార్కాపురం రోడ్‌లో, కారంపూడి రోడ్, నరసరావుపేట రోడ్, వెల్లటూరు రోడ్‌లలో బస్‌షెల్టర్లు నిర్మించబోతున్నామని అన్నారు. వినుకొండలోని నరసరావుపేట రోడ్డులో రెండు చోట్ల, కారంపూడి రోడ్డులో రెండు చోట్ల, మార్కాపురం రోడ్డులో ఒకచోట స్థలాలను పరిశీలించామన్నారు. రానున్న 2, 3 నెలల్లో వాటిని పూర్తి చేస్తామని,. ఇంకా ఎక్కడైనా కావాలని మున్సిపల్ కమిషనర్ చెబితే అవి కూడా కట్టిస్తామన్నారు. ఇదే సందర్భంగా వినుకొండ సురేష్ మహల్ రోడ్డులో నిర్మిస్తున్న మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్‌నూ ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరించారు.

# థాంక్యూ పెమ్మసాని సార్



- ఏడో తరగతి విద్యార్థికి పెమ్మసాని ట్రస్ట్ సహాయం
- విద్యార్థికి సైకిల్ అందజేత

**గుంటూరు, మేజర్ న్యూస్ :** "సార్.. స్కూల్ నుంచి మా ఇల్లు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. రోజూ అక్కడి నుంచి రాలేకపోతున్నాను. నాకు ఒక సైకిల్ కొనివ్వండి సార్." అని నోరు తెరిచి అడిగిన విద్యార్థి కోరికను గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. విద్యార్థి కోరిన రెండు రోజుల్లోనే అతనికి సైకిల్ కొని ఇచ్చారు.

**వివరాల్లోకి వెళితే..**

తెనాలి మండలం నందివెలుగులోని జడ్పీ హైస్కూల్ లో నూతన భవనాలను పెమ్మసాని ఇటీవలే ప్రారంభించారు. కార్యక్రమం ముగించుకొని తిరిగి వస్తుండగా అదే స్కూల్లో చదువుకుంటున్న ఏడో తరగతి చదువుతున్న చదువుకుంటున్న మందా శరత్ బాబు అనే విద్యార్థి పెమసాని కారు వద్దకు వచ్చి ఆయన ఆపాడు. నూతనంగా ఏర్పాటుచేసిన స్కూలుకు వచ్చేందుకు రోజు ఇబ్బంది పడుతున్నానని, స్కూల్ బ్యాగ్ మోయలేక భుజాలు నెప్పి పడుతున్నాయని వివరిస్తూ సదరు విద్యార్థి పెమసానికి తన సమస్యను వివరించాడు. సమస్యను సావధానంగా అడిగి తెలుసుకున్న పెమ్మసాని స్పందిస్తూ.. "నువ్వు బాగా చదువు కుంటానని మాట ఇస్తే సైకిల్ కొనిస్తాను." అని చెప్పిన రెండు రోజుల్లోనే ఆ కుర్రాడి ఇంటికి ఒక నూతన సైకిల్ ను కొని ఇచ్చి పంపించారు. కేంద్రమంత్రి తమ బిడ్డకు సైకిల్ కొనిపెట్టి ఆదుకున్నందుకు విద్యార్థి తండ్రి ఆనందం వ్యక్తం చేశారు. సైకిల్ అందజేసిన తర్వాత ఢిల్లీలో ఉన్న పెమ్మసాని కి.వీడియో కాల్ దవెల్ ఆ కుర్రాడితో ఫోన్లో మాట్లాడారు. కేంద్ర మంత్రి తో ఫోన్లో మాట్లాడుతూ సదరు విద్యార్థి ధన్య వాదాలు తెలియజేస్తూనే, ఆనంద భాష్పా లతో తన ఆనందాన్ని వ్యక్తపరిచాడు. ఎన్నో ఏళ్లుగా తాను తన మామయ్యను తల్లిని సైకిల్ కొనిమని అడుగుతున్నానని, అయితే తమకున్న ఆర్థిక ఇబ్బంది కారణంగా కొనుక్కోలేక పోయారని తెలిపాడు. నందివెలుగులో స్కూల్ భవనాల ప్రారంభోత్సవం నాడు పెమ్మసాని గారు మాట్లాడుతూ ఎవరికీ ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని ఆయన చెప్పిన విధానం తనకు నచ్చిందని చెప్పాడు. చాలామంది తమకు రోడ్లు కావాలి, నీళ్లు కావాలి అని అడగడం తాను చూశానని, అయితే స్కూలుకు 2 కిలోమీటర్ల దూరం నుంచి నిత్యం నడుచుకుని వస్తున్న నాకు ఒక సైకిల్ ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో పెమ్మసాని ని సాధారణంగా అడిగాను. అయితే పెమ్మసాని గుర్తుపెట్టుకుని మరీ నాకు సైకిల్ కొని, పంపిస్తారని నిజంగా ఊహించలేదు."

## ఏబీవీపి 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**ఏ ఎన్ యు/ పెదకాకాని, మేజర్ న్యూస్ :** ఈనెల 24, 25, 26 తేదీలలో విశాఖపట్నంలో జరిగే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) ఆంధ్రప్రదేశ్ 43వ రాష్ట్ర మహా సభల గోడ పత్రికను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. గంగాధర రావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ యూనివర్సిటీ సెక్రెటరీ వంశీ మాట్లాడుతూ జ్ఞానం, శీలం, ఏకతా , వందేమాతరం, వంటి నినాదాలతో గత 75 సంవత్సరాలుగా నిరంతరం విద్యా సమస్యల పరిష్కారానికై పరితపిస్తూ విద్యార్థుల లో జాతీయ భావాలను నింపుతూ వారి శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న సంస్థ ఏబీవీపీ అని అన్నారు. ఈ రాష్ట్ర మహాసభలలో రాష్ట్రవ్యాప్తంగా 1200 మంది ప్రతినిధులు పాల్గొనున్నారు. ఈ మహసభలలో విద్యారంగ సమస్యలపై విద్యారంగ స్థితి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించునున్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై రాష్ట్ర స్థితి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. అలాగే సమాజ సేవ చేస్తున్న 40 సంవత్సరాలోపు వ్యక్తులకు జనమంచి గౌరీశంకర్ యువపురస్కార్ అవార్డు ఇస్తామన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ మణికంఠ, జాయింట్ సెక్రటరీ గంగాధర్ , బీటెక్ విభాగం ప్రెసిడెంట్ సాయి, వైస్ ప్రెసిడెంట్ అక్ష్యకుమార్ , సెక్రటరీ శివరామరాజు, కార్యకర్త గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధం



**ఈపూరు మేజర్ న్యూస్ :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని వనికుంట గ్రామంలో మంగళగవారం జరిగింది. ప్రమాదంలో రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక గేదె చనిపోయింది. నాలు గేదెలు గాయపడ్డాయి. సుమారు 18 లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటదని అంచనా నష్టపోయిన బాధితులు బచ్చనబోయిన ఆంజనేయులు మరియు షేక్ నన్నేషా తెలిపారు. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడం వల్ల ఆస్తి నష్టం జరగడం చాలా బాధాకరమని ఈపూర్ ఎస్సై మరియు రెవిన్యూ సిబ్బంది విచారణ వ్యక్తం చేశారు. బాధితులకు 30 కేజీల బియ్యం సరుకులు అందించార.

## ఉల్లాస్ పుస్తకాలు పంపిణిచేసిన యంపిపి సునీత సాయి శంకర్



**దుర్గి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, మండల కేంద్రమైన దుర్గిలోని వెలుగు కార్యాలయం నందు మంగళవారం వాలంటీర్ టీచర్లకు ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు మాణిక్యం అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దుర్గి మండల యం పి పి యేచూరి సునీత సాయి శంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వయోవృద్ధ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చువిధంగా ఈ ఉల్లాస్ కార్యక్రమంని ప్రవేశపెట్టిందని తెలిపారు. వెలుగు ఎ పి యం రంగారెడ్డి వాలంటీర్ టీచర్స బుక్స్, హాజరు పట్టీలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యం పి డి ఓ శివప్రసాద్, ఈ ఓ పి ఆర్ధి సత్యప్రసాద్, సి సి లు మరియు కంప్యూటర్ ఆపరేటర్ ప్రియాంక, వాలంటీర్ టీచర్స్ పాల్గొన్నారు.

## క్రేన్ సంస్థల అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ప్రముఖ వ్యాపారవేత్త క్రేన్ సంస్థల అధినేత గ్రంధి వెంకట సత్యలక్ష్మి కాంతారావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరుణా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొమరాల ఏసుదాసు, సెక్రటరీ ఎం విక్టోరియా రాణి లు మంగళవారం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరుణా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొమరాల ఏసుదాసు మాట్లాడుతూ అనునిత్యం పేదల కోసం తపిస్తూ ఎంత ఎదిగిన ఒదిగే ఉండాలని మనస్తత్వం కలిగిన వ్యక్తిని కొనియాడారు. ఎంతోమంది పేద బడుగు బలహీన వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు అన్నారు. ఇలాంటి వ్యక్తి మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆ దేవుని ప్రార్థిస్తున్నట్లు అరుణా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొమరాల ఏసుదాసు తెలిపారు.

## ఎమ్మెల్యే యరపతినేని చొరవతో సిసి రోడ్ నిర్మాణాలు



**మాచవరం , మేజర్ న్యూస్ :** గురజాల నియోజకవర్గం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని మండల తెలుగు యువత అధ్యక్షుడు షేక్ అస్సాన్వలి అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో సిసి రోడ్ నిర్మాణాలకి పది లక్షల గ్రాంట్ మంజూరు చేయగా మంగళవారం నిర్మాణాలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. మాజీ సర్పంచ్ షేక్ మాబు వలి మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందంటే ఒక యరపతినేని ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని ఆయన అన్నారు. కార్యకర్తలకు అండగా ఉండే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అల్లావుద్దీన్, చిన్న కరీం మైనార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించిన యం. పి. పి.

**దుర్గి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, దుర్గి మండలంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రం హ్మేంద్ర స్వామి వారి 71వ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా రెండవ రోజు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మంగళవారం దుర్గి మండలం యం. పి. పి. సునీత సాయి శంకర్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ పోటీలో నాలుగు పండ్ల విభాగంలో మొత్తం 8 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా దాచెపల్లిమండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 4915 అడుగులు దూరం లాగి ప్రథమ స్థానాన్ని దక్కించు కున్నాయి. ఈ బల ప్రదర్శనకు సంబధించిన బండను మల్లెల వెంకటేశ్వర్లు బహుకరించారు.

## అంకిత భావంతో విధులు నిర్వహించిన గౌస్

### బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ గౌస్‌కు ఘన సన్మానం



**ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :** మండల పోలీసు స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సయ్యద్ గౌస్ నర్సారావుపేట ట్రాఫిక్ కు బదిలీ పై వెళు తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గౌస్ ను ఎస్సై యు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో శాలువా తో సత్కరించి అభినందనలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ గౌస్ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేశారని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్ ఐ లు మక్కెన మాధవరావు, నవరాజు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రీ సర్వే పై వీడియో కాన్ఫరెన్స్

### సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



**ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :** పల్నాడు సంయుక్త కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్ రీ సర్వే, ఇతర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ సమావేశంలో మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే వేగంగా ప్రారంభించాలన్నారు అడంగల్‌ను ప్రక్షాళన చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి జి .రమాకాంత్ రెడ్డి, తహసీల్దార్ యం.భవానిశంకర్, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మండల సమైక్యలో అవగాహన సదస్సు



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల మండల సమైక్యలో ఐబి యాంకర్ పర్సన్ సుబ్బారావు మాట్లాడుతూ ఐబిలో భాగంగా పిడుగురాళ్ల మండలంలో కొన్ని రిపోర్ట్స్ పరిశీలించడమైనది. కొత్తవారికి అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా ఎంబుక్ కీపింగ్, లోకోస్, వీపీఆర్ టీ సర్వే, ఎస్ హెచ్ సర్వే చేపించటం జరిగింది. అందులో భాగంగా డౌట్ మొత్తం వివరించటం జరిగింది. గ్రేడ్లు కొంచెం వెనకబడిన కారణంగా వాళ్లకి ఓరింటేషన్ కల్పించి మండలంలో గ్రేడింగ్ అన్నిటిలో ముందుండే విధంగా అవగాహన కల్పించటం జరిగింది. దీనికి సంబంధించి అందరూ పాల్గొన్నారు. అందరికీ అర్థమయ్యేటట్లు ట్రైనింగ్ ఇచ్చి, ఎట్టి పరిస్థితుల్లో జనవరిలో అన్ని రిపోర్ట్స్ ముందుంచి జిల్లాలో మంచి పొజిషన్ లో ఉంచే విధంగా కోరుతున్నాం. ఆ విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం



**ఈపూరు మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా ఈపూరు మండలంలో మంగళవారం శివశక్తి లీలాంజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది శిబిరంలో మండలంలోని ఈపూరు, అంగలూరు, కొండయ్య పాలెం, వనికుంట గ్రామాలకు సంబంధించిన ప్రజలను దాదాపుగా 320 మందిని పరీక్షించగా 97 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని తెలపడం జరిగింది, కార్యక్రమంలో శంకర ఆసుపత్రి డాక్టర్లు మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది. ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తున్నటువంటి శివశక్తి ఫౌండేషన్ వారికి మేము ఎంతో రుణపడి ఉంటాం ఎంతోమంది నిరుపేదలకు వైద్యం అందిస్తున్న డాక్టర్లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం అని ప్రజలు కొనియాడారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారి పి. పవన్ కుమార్**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారి పి. పవన్ కుమార్ సూచించారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని ఆటో డ్రైవర్లకు నవులూరు ఎంవీఐ కార్యాలయం ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, నిబంధనలు అతిక్రమించరాదన్నారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షిత గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అధిక లోడుతో ప్రయాణాలు వద్దని డ్రైవర్లకు తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నా రు. డ్రైవింగ్ చేసేటప్పుడు మానసిక, శారీరక ఏకాగ్రత ఎంతో అవసర మన్నారు. ఇతర ఆలోచనలతో, అతి వేగంతో ఆటోలు నడపరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఆటోల్లో ఎక్కిస్తే కేసులు తప్పవన్నారు.

## కెఎల్‌యు విద్యార్థి ముఖేష్‌కు రజత, కాంస్య పతకాలు




**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** ఆల్ ఇండియా ఇంటర్ యునివర్సిటీ షూటింగ్ చాంపియన్షిప్ లో కె ఎల్ యునివర్సిటీ కి చెందిన నేలవల్లి ముఖేష్ రజత పతకం సాదించినట్లు వర్శిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం లో ముఖేష్ కు 582 /600 స్కోర్ తో ఈ పతకం లభించింది. ఈ నెల 8 నుంచి చండీఘర్ లోని మొహాలీ షూటింగ్ రేంజ్ లో పంజాబ్ యునివర్సిటీ ఆధ్వర్యం లో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిశ్రమ విభాగం లో ముఖేష్ , నాగసాయి తరుణ్ .పి, తనిష్క్ మురళిధర్ నాయుడులతో కూడిన కె ఎల్ యునివర్సిటీ జట్టు 5వ స్థానం లో నిలిచి మరో కాంస్య పతకం కూడా గెలుచుకున్నారని అన్నారు. ముఖేష్ నేలవల్లి కె ఎల్ యునివర్సిటీ లో బీ టెక్ సిఎస్ ఐటి 3వ సంవత్సరం చదువుతుండగా, నాగసాయి తరుణ్.పి , తనిష్క్ మురళిధర్ నాయుడు లు బిబిఎ చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, వ్యాయామ అద్యాపకులు విజేతలను అభినందించారు.

## తురకపాలెంలో పశు ఆరోగ్య శిబిరాలు



**మాచవరం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 20వ తేదీ నుండి 30వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మాచవరం మండలం పశు వైద్య అధికారి డాక్టర్ కె. వెంకటేశ్వరరావు తెలిపారు. మాచవరం మండలం లో రెండు టి ములు రోజుకి ఒక గ్రామం నందు పశు వైద్య శిబిరాలు నిర్వహించబడతాయని ఆయన అన్నారు. మండలంలోని పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశు వుల చూడి పరీక్షలు,గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందులు,యధకు రానీ పశువులకు చికిత్సలు అందజేశారు.ఈ కార్య క్రమం లో ఎంపీటీసీ షేక్ చిన్న సైదా, మండల తెలుగు యువత అధ్యక్షులు షేక్ అసాన్వలి, మాజీ సర్పంచ్ షేక్ మాబు వలి, మైనార్టీ నాయకులు షేక్ అల్లావుద్దీన్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు అల్లావుద్దీన్ స్థానిక నాయకులు, రైతులు పశు వైద్య సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నింటిని వేగవంతం చేయాలి





### అడ్మిన్స్, నోడల్ అధికారులకు నగర కమిషనర్ ఆదేశాలు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్**

ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నింటిని వేగవంతం చేయాలని, నోడల్ అధికారులు కార్యదర్శులు చేస్తున్న సర్వేల పై ప్రత్యేక దృష్టి సారించాలని అడ్మిన్ కార్యదర్శులు, నోడల్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరం నందు సచివాలయాల కార్యదర్శులు మరియు నోడల్ అధికారులతో సమావేశం నిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ తొలుత కార్యదర్శుల వారీగా మిస్సింగ్ సిటిజెన్స్, పి.ఏ.సి.యస్, హౌసింగ్ జియో ట్యాగ్, యన్.పి.సి.ఐ, నాన్ రెసిడెంట్ ఇన్ ఏ.పి, యం.యస్.యం. ఈ సర్వేల పురోగతి పై వివరాలడిగి తెలుసుకొని, మాట్లాడుతూ సర్వేల వేగవంతం పై కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించి గురువారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఇక నుండి సర్వేలను మరియు సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేస్తామని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ మెరుగైన సేవలను అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండేవారిపై ఖటిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సిటిజెన్ డేటాబేస్ ను సిద్దం చేయడానికి, సూక్ష్మ, మధ్యతరగతి వ్యాపార సంస్థలకు రాష్ట్ర, కేంద్ర సంక్షేమ పథకాలు అమలు చేయడానికి సర్వేలు చేస్తున్నామన్నారు. సర్వేకు నగర ప్రజలు పూర్తి స్తాయిలో సహకరించి సచివాలయ కార్యదర్శులకు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమీషనర్ డి. శ్రీనివారావు, సెక్రటరీ పి. శ్రీనివాసరావు, ఆర్.ఓ రెహమాన్, నోడల్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# కూటమి పాలన 7 నెలల్లో రాష్ట్రానికి రూ.4లక్షల కోట్ల పెట్టుబడులు : చీఫ్ విప్ జీవీ



**వినుకొండ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 7 నెలల్లో 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. సీఎం చంద్రబాబు కృషి కారణంగానే ఇది సాధ్యమవుతోందని, పరిశ్రమలు పెట్టాలన్నా, పెట్టుబడులు తీసుకుని రావాలన్నా, ఉద్యోగాలు ఇవ్వాలన్నా ఎన్డీయే ప్రభుత్వమేనని ప్రజలంతా చర్చికుంటున్నారని తెలిపారు. ఈ 7 నెలల్లోనే 5 ఏళ్ల వైకాపా – కూటమి పాలన మధ్య తేడాను అంతా గమనించారన్నారు. ప్రస్తుతం కూడా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దావోస్ పర్యటన విజయవంతంగా సాగుతుందని, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆర్సెలార్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీమిత్తల్‌తో సమావేశం ఫలప్రదమైందని, ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ జేవీ సంయుక్తంగా 17.8 మిలియన్ టన్నుల కెపాసిటీతో అనకాపల్లి సమీపంలో 2 దశల్లో రూ.1.4 లక్షల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. మంగళవారం ఈ మేరకు మీడియాతో మాట్లాడిన చీఫ్ విప్ జీవీ.. ఐదేళ్ల వైకాపా పాలనలో ఇటు కేంద్రం నుంచి గానీ, అటు పరిశ్రమలు, పెట్టుబడుల రూపంలోగానీ రాష్ట్రానికి ఒరిగింది శూన్యమన్నారు. వైకాపా పాలనలో విశాఖ ఉక్కును తాకట్టు పెట్టేశారని, కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోలేదని వాపోయారు. కానీ సీఎం చంద్రబాబు అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి రూ.12 వేల కోట్లు, విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు సహా కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక విధాలుగా నిధులు తెస్తున్నారని, ఆ విషయంలో సహకరిస్తున్న ప్రధానమంత్రికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా మన్నారు. ప్రస్తుత దావోస్ యాత్రతో పాటు గతంలో విదేశాల్లో లోకేష్ పర్యటనలు మంచి సత్ఫలితాలను ఇస్తుందన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు మంచి మలుపు అని అభిప్రాయ పడ్డారు. దూరదృష్టితో చంద్రబాబు నవ్యాంధ్ర నిర్మాణం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు. కచ్చితంగా స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధించుకుంటా మన్నారు. ఇదే సమయంలో వినుకొండలోని నరసరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్డు, కారంపూడి రోడ్డులో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్లు నిర్మిస్తామని తెలిపారు. శరవేగంగా అర్బన్ హౌసింగ్ స్కీమ్ పూర్తవుతుందన్నారు. రామలింగేశ్వరస్వామి ఘాట్ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారన్నారు. త్వరలోనే ఘాట్ రోడ్డు పనులు కూడా చకచకా పూర్తి చేస్తామని, రూ.150 కోట్ల మంచినీటి పథకాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. సమర్ధవంతమైన కమిటీతో కొండపైన రామలింగేశ్వరస్వామి గుడి నిర్మాణాన్ని కూడా శరవేగంగా పూర్తి చేస్తామన్నారు.

# శానిటేషన్ కార్యదర్శులు మస్టర్ నేరుగానే వేయాలి : కమిషనర్



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్**


వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు మస్టర్ సమయంలో తప్పనిసరిగా ప్రజారోగ్య కార్మికుల హాజరు తీసుకోవాలని, మైక్రో పాయింట్స్ వారీగా పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు పారిశుధ్య పనులు జరిగేలా కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ నాజ్ సెంటర్ రిజర్వాయర్ లోని మస్టర్ పాయింట్లను ఆకస్మిక తనిఖీ చేసి, కార్మికులు, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి, మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికుల హాజరును సచివాలయ శానిటేషన్ కార్యదర్శులే తీసుకోవాలన్నారు. కార్మికులు అత్యవసరమైతే తప్ప సెలవులకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా సెలవుల రిజిస్టర్ మెయిన్టైన్ చేయాలన్నారు. శానిటేషన్ డివిజన్ల వారీగా పారిశు ధ్య పనులకు అవసరమైన పుష్ కాట్స్, డంపర్ బిన్లను ఎప్పటికప్పుడు మరమత్తులు చేయించి, కార్మికులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. అనంతరం కావేరి నగర్, నగరంపాలెం దర్గా వెనుక రోడ్, ఐపిడి కాలనీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు డ్రైన్ టు డ్రైన్ ఉండేలా, డ్రైన్ల నిర్మాణం చేసిన తర్వాతనే రోడ్ల నిర్మాణం చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా నిర్మాణం చేసిన డ్రైన్లలో మురుగుపారుదల సక్రమంగా ఉండడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్మాణ సమయంలో లెవల్స్ పాటించాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. నల్లచెరువు మెయిన్ రోడ్ లోని అన్న క్యాంటీన్ ని పరిశీలించి, ఆహార పదార్ధాల నాణ్యత, శుభ్రతపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రూ.5కే ఆహారం అందించాలని అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని, సిబ్బంది క్యాంటీన్ కి వచ్చే ప్రజలపట్ల మర్యాదగా వ్యవహరిస్తూ భోజనం అందించాలని ఆదేశించారు. ప్రతి రోజు వస్తున్న ప్రజల సంఖ్యను అనుసరించి, అవసరమైతే ఇండెంట్ పెంచుకోవాలన్నారు. పర్యటనలో డిఈఈ మధుసూదనరావు, ఆర్ఓ మదన్ గోపాల్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేని మాటలు..

## నోరు జారితే తాట తీస్తాం.. జాగ్రత్త

- మాజీ మంత్రి అంబటి రాంబాబుకు కూటమి నాయకుల హెచ్చరిక






**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గత ఆరు నెలల్లో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక రాసలీలల, డప్పు రాంబాబు సిగ్గు శరం లేని మాటలు మాట్లాడుతున్నారని కూటమి పార్టీల నాయకులు విమర్శించారు. రఘురామ్ నగర్ ప్రజా వేదిక నందు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సోమవారం అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల తన పాలనలో సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో వెనక్కి నెట్టి, వెకిలి చేష్టలతో భ్రష్టు పట్టించి నంగనాచి మాటలు అంబటి మాట్లాడు తున్నాడని నోరు జారితే తాట తీస్తామని వారు హెచ్చరించారు. వైకాపా పాలనలో సాండ్, ల్యాండ్, మైనింగ్ మాఫియా రెచ్చిపోయిందని అంబటి తమ్ముడు, అల్లుడు నియోజకవర్గంలో సహజ వనరుల్ని దోచుకున్నారని ఆరోపించారు. స్కాములు తప్పితే అంబటి చేసిన ఒక అభివృద్ధి పని లేదన్నారు. అభివృద్ధి ప్రదాత కన్నా లక్ష్మీనారాయణను విమర్శించే నైతిక హక్కు అంబటికీ లేదన్నారు. కాంట్రాక్టర్లు రాజకీయాలు చేయకూడదా సేవాభావంతో వాళ్లు పని చేయకూడదా అని అంబటిని ప్రశ్నించారు. ఇద్దరు నాయకుల్ని పెట్టుకొని అంబటి దోచేశాడని విమరించారు. గత మెజారిటీ కంటే ఒక ఓటు అయినా ఎక్కువ వస్తుందని రాకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నావు మరి ఏ మొహం పెట్టుకొని ఇంకా రాజకీయాల్లో ఉన్నావు దుయ్యాబట్టారు. సంబరాల రాంబాబుకి సత్తెనపల్లి ప్రజలు తగిన బుద్ధి చెప్పిన ఇంకా తీరు మారకపోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గ చరిత్ర లోనే అత్యధిక మెజార్టీతో కన్నా లక్ష్మీనారాయణను ప్రజలు గెలిపిస్తే నోరు జారుతావా ఖబడ్దార్ అంబటి అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళఅమరేశ్వరరావు, పెద్దిరాజు, చోటా శ్రీనివాసరావు, పూజల వేంకట కోటయ్య, ఆళ్ళ సాంబయ్య, కంబాల వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, జనసేన నాయకులు తవిటి భావన్నారాయణ, బిజెపి నాయకుకు శంకరరావు, ఆకుకూరి నాగేశ్వరరావులు మాట్లాడారు. వివిధ హెూదాల్లో ఉన్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

# శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు ప్రారంభానికి యాక్షన్ ప్లాన్





- ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్ధం చేసుకోవాలి
- ట్రాఫిక్, రైల్వే, నగరపాలక సంస్థ అధికారుల సమీక్షలో నగర కమిషనర్

గుంటూరు మేజర్ న్యూస్ : శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు ప్రారంభానికి ముందే నగరంలోని ప్రధాన రహదారులను ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్ధం చేసుకోవాలని, ట్రాఫిక్, రైల్వే, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంభర్ లో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ , గల్లా మాధవి, జిఎంసి, రైల్వే, ఆర్ అండ్ బి, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్ఓబి నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్ విస్తరణ పనులు ప్రారంభించామని, ఇప్పటికే ప్రభావిత భవన యజమానులకు నోటీసులు ఇచ్చి, అంగీకారం తెలిపిన భవనాలను తొలగిస్తున్నా మన్నారు. ఆర్ఓబి పనులు ప్రారంభమైతే గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రధాన రహదారులను సిద్ధం చేసుకోవల్సి ఉంటుం దన్నారు. ప్రధానంగా 3 వంతెనల వద్ద మరొక వెంట్ ఏర్పాటు చేసి, రోడ్ వెడల్పు చేయడానికి రైల్వే అధికారులు పరిశీలించాలని, తద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చన్నారు. అలాగే శంకర్ విలాస్ సెంటర్ నుండి అమరావతి రోడ్ లోని ఇన్నర్ రింగ్ రోడ్ జంక్షన్ వరకు, బ్రాడీపేట, అరండల్ పేటల్లో రోడ్ల ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ గారు మాట్లాడుతూ నగరానికి కీలకమైన ఆర్ఓబి పనులు జరిగే క్రమంలో అన్ని శాఖలను, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేకంగా సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించడానికి పరిశీలించాలని కోరారు. నిర్మాణ పనుల వలన జిజిహెచ్, రైల్వే స్టేషన్ కు వచ్చే వేల మంది ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను త్వరగా సిద్ధం చేసుకోవాలన్నారు. అరండల్ పేట, బ్రాడీపేట 1వ లైన్లను విస్తరణ చేయడానికి రైల్వే, జిఎంసి సంయుక్తంగా కృషి చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ శానసభ్యులు మాధవి గారు మాట్లాడుతూ బ్రాడిపేట 14వ అడ్డరోడ్ లోని రైల్వే గేటుని ఆర్ఓబి నిర్మాణ పనులు జరిగే కాలంలో రాకపోకలకు అవకాశాన్ని రైల్వే అధికారులు కల్పించడానికి చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గుతుందన్నారు. అలాగే ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించాలని, ముందుగా ఫుడ్ కోర్ట్ లేదా వెండింగ్ జోన్లను కేటాయించాలని సూచించారు. జిజిహెచ్ కి నిత్యం ఎమర్జన్సీ అంబులెన్స్ వస్తుంటాయని, అందుకు తగిన విధంగా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో రైల్వే ఏఓఎం ముఖేష్ కుమార్, డిఈఎన్ భరత్ కుమార్, జిఎంసి ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఆర్%డ%బి ఈఈ విశ్వనాధరెడ్డి, డిఈఈ చిన్నయ్య, ట్రాఫిక్ సిఐలు అశోక్ కుమార్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి అరుణ




**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్ :** మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పని సరిగా ఈ -పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి అరుణ సూచించారు. మండలం లోని మాదల, ఇరుకుపాలెం గ్రామల లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి యం. అరుణ మాట్లాడుతూ మొక్కజొన్న పైరు ప్రస్తుతం 50-60 రోజుల దశలో ఉన్నది కావున రైతులు మొక్కజొన్న పైరు కాండం తొలిచే పురుగు నివారణ కొరకు పైపాటుగా కోరాజెన్ 60 ఎం ఎల్ ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. అదే విధంగా కత్తెర పురుగును గమనించినట్లైతె ఈమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రా లేదా తయోమెథాక్సామ పురుగు మందును పై పాటుగా పిచికారి చేసుకున్నట్లైతే పురుగును సమర్ధ వంతంగా నివారించు కోవచ్చు అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాదల సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, నరేష్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతి కోసమే పొలం పిలుస్తోంది : డిపివో ఐ.మురళి



నూజెండ్ల మేజర్ న్యూస్:- మండలంలోని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో చింతలచెరువు, మూర్తిజాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి పాల్గొన్నారు. డిఏవో ఈ కార్యక్రమంలో భాగంగా కంది, వరి, మిరప పంటలను రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేసారు. సమావేశంలో డిఏవో మాట్లాడుతూ వరి,కంది పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు రైతులకు అవగాహన కల్పించారు. వరి, కంది పంట ఉత్పత్తులకు మద్దతు ధరకు పొందుటకు స్థానిక రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులును సంప్రదించాలని కోరారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ బి.రవిబాబు, ఏవో సుగుణా బేగం, ఏఈవో ఏలీషా, విఏఏలు వై.గోపి, ఆర్.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## భీమవరం పంచాయతీ కార్యదర్శి కోటిరెడ్డి మృతి



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని భీమవరం గ్రామపంచాయతీ కార్యదర్శి గా పని చేస్తున్న నక్క కోటి రెడ్డి గత రెండు నెలలు గా అనారోగ్యంతో సెలవులో ఉన్నారు. ఆయన సోమవారం మృతి చెందారని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌రెడ్డి, విస్తరణ అధికారి, మండల పరిషత్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు భీమవరం గ్రామ సర్పంచులు ఇతర నాయకులు భీమవరం సచివాలయ సిబ్బంది కోటిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున వారికి రావలసినటువంటి అన్ని రకాల బిల్లులు ఇతరములు వచ్చే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## కండ్లగుంట, చాగల్లులో పొలం పిలుస్తుంది



**నకరికల్లు, మేజర్ న్యూస్ :** ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక టెక్నాలజీ వాడి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు అని అన్నారు. రైతులు వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి వ్యవసాయ శాఖ వారు సిఫార్సు చేయబడిన పురుగుమందులను వాడటం వల్ల వాతావరణం పొల్యూషన్ తగ్గటమే కాకుండా, తక్కువ నీటి పరిమాణం అనగా 10 లీటర్ల నీరు ఎకరా పొలంపై పిచికారి చేయటానికి సరిపోతుంది, సమయం ఆరు నుండి 8 నిమిషాల్లో ఎకరా పొలం మొత్తం పిచికారి చేయడం జరుగుతుంది మరియు మందు పనిచేయు సామర్థ్యం బాగా పెరుగుతుందన్నారు. మొక్కజొన్న పంటలో ప్రస్తుతం చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు సవ్యవరంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం, శ్రీనివాస్,కే.కృష్ణ,గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వేమవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



మాచవరం మేజర్ న్యూస్ : మాచవరం మండలంలోని వేమవరం మరియు గంగిరెడ్డిపాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిని కే.రామమ్మ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పంట పొలాలను పరిశీలించి కంది మరియు మిరప పంట యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో కంది, వరి, పొగాకు, మొక్క జొన్న మొదలయిన పంటలు వేసిన రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకుని, ఈ కేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ శాఖ సిబ్బంది ఎం.నరసయ్య, సిహెచ్.వంశీ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీ- బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ – బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్ అండ్ డీ వైస్ ప్రెసిడెంట్ మురళీక్రిష్ణ మీనన్, బిజినెస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్ట్రాటజిక్ సర్వీసెస్ హెడ్ మనోగరన్‌లతో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చునన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, సెమినార్‌లు మరియు ఇండస్ట్రీ – అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాస్టర్స్, పీహెచ్‌డీలు పూర్తి చేయడానికి కావలసిన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్ అండ్ డీ వైస్ ప్రెసిడెంట్ మురళీక్రిష్ణ మీనన్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదనివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో
సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది,
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో
"నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని
నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో
ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను.
ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి
ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం,
5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను,
8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్,
11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి,
13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466
ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.


# కొత్త మిర్చి రాకతో గుంటూరు యార్డ్ కళకళ



- రైతులతో మార్కెట్ యార్డులో సందడి
- రోజుకు లక్ష టిక్కీలకు పైగా రాక
- నల్గొండ, ఖమ్మం జిల్లాల నుంచి తరలివస్తున్న మిర్చి
- మిర్చి అమ్మకాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గుంటూరు మిర్చియార్డులో కొత్త సీజన్ మొదలైంది. సంక్రాంతి తరువాత రైతులు మిర్చిని అమ్మకానికి తీసుకురావడం ఆనవాయితీ. నిత్యం లక్షలాది బస్తాల సరకు వచ్చే అవకాశం ఉండడంతో యార్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం 90,567 బస్తాల టిక్కీ రాగా.. 77,096 బస్తాలు అమ్ముడుపోయాయి. సాయంత్రానికి 54,523 బస్తాల నిల్వ ఉంది. ప్రస్తుతం కొత్త పంట రాకతో ఉదయం 6 గంటల నుంచే మార్కెట్లో సందడి నెలకొంటోంది. ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, ఖమ్మం తదితర జిల్లాల్లో తొలి కోతలు పూర్తయిన పంటను రైతులు తెస్తున్నారు. ప్రతి రోజు సుమారుగా 5 వేలమందికిపైగా రైతులు 90 వేల బస్తాలకుపైగానే మిర్చి తెస్తున్నారు. యార్డులోకి రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా 3 గేట్ల నుంచి వాహనాలు వెళ్లే ఏర్పాట్లు చేశారు. రద్దీ పెరిగితే 5 గేట్లు తెరవనున్నారు. రైతులకు తాగునీరు, విశ్రాంతి గదులను సిద్ధం చేశారు. యార్డు లోపల అవసరాలకు తాత్కాలికంగా 25 మంది సీజన్ వర్కర్లను తీసుకోవాలని నిర్ణయించారు. అవసరాన్నిబట్టి 40 మంది వరకు సంఖ్య పెంచుకోనున్నారు.


18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777



## నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

సంక్రాంతి శుభాకాంక్షలు..
"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు
జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు
సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు,
ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి
ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు.
సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును.
మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) — బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు — గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) — స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
జి.హిరన్మాయి (కన్నల్) — నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్

| | | | |
|---|---|---|---|
| శేషగిరి రాజు<br>మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 8341408201 | వై.ఏసుబాబు<br>గురజాల ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 9701250872 | బి.పూర్ణచంద్రరావు<br>సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 9866246951 | చెవుల రంగారావు<br>మెడికల్ రిపోర్టర్, గుంటూరు<br>సెల్ : 9490544635 |
| యం.కృష్ణ<br>మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 9393309149 | వి.రవికుమార్<br>తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 99083 38200 | డి. చైతన్య<br>వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 9381968453 | వి.లూథర్<br>నరసరావుపేట రిపోర్టర్<br>సెల్ : 7799382078 |
| జి.ఏలియా<br>ముప్పాళ్ళ రిపోర్టర్<br>సెల్ : 9392231959 | బి.సాంబశివరావు<br>రాజుపాలెం రిపోర్టర్<br>సెల్ : 9949382676 | రమేష్<br>దుగ్గిరాల రిపోర్టర్<br>సెల్ : 9866782780 | ఎస్.వెంకటేశ్వర్లు<br>పెదకాకాని రిపోర్టర్<br>సెల్ : 9948175840 |
| కె.నాగరాజు<br>రిపోర్టర్, గుంటూరు<br>సెల్ : 7799881000 | డి.రమేష్<br>ఈపూరు రిపోర్టర్<br>సెల్ : 9110734898 | పి.లక్ష్మీనారాయణ<br>నూజెండ్ల రిపోర్టర్<br>సెల్ : 9666474953 | ఎస్.కె. రవూఫ్<br>శావల్యాపురం రిపోర్టర్<br>సెల్ : 7989434737 |
| అక్కిరెడ్డి<br>నరసరావుపేట మెడికల్ రిపోర్టర్<br>సెల్ : 9849134987 | బి.గురవయ్య<br>వినుకొండ క్రైం రిపోర్టర్<br>సెల్ : 9908340426 | వి.లక్ష్మీనారాయణ<br>రెంటచింతల రిపోర్టర్<br>సెల్ : 8500079075 | పి.వెంకటేశ్వర్లు<br>దుర్గి రిపోర్టర్<br>సెల్ : 8185815858 |
| టి.శ్రీకాంత్<br>వెల్దుర్తి రిపోర్టర్<br>సెల్ : 9912818723 | పి.మణికంఠ<br>మాచర్లటౌన్ రిపోర్టర్<br>సెల్ : 7013169885 | ఎస్.డి.మహబూబ్<br>మాచర్ల క్రైం రిపోర్టర్<br>సెల్ : 9989124898 | ఎం.కోటేశ్వరరావు<br>మాచవరం రిపోర్టర్<br>సెల్ : 6303775169 |
| డి.మల్లికార్జునరావు<br>యడ్లపాడు రిపోర్టర్<br>సెల్ : 8309237441 | రమేష్<br>క్రోసూరు రిపోర్టర్<br>సెల్ : 9493148828 | రాజ్‌కుమార్<br>పిడుగురాళ్ళటౌన్ రిపోర్టర్<br>సెల్ : 9160218268 | షేక్ నాగూర్<br>నకరికల్లు రిపోర్టర్<br>సెల్ : 98489 26300 |
| పి.ఆనంద్<br>వినుకొండ రూరల్ రిపోర్టర్<br>సెల్ : 8125125239 | నాగరాజు<br>మంగళగిరి టౌన్ రిపోర్టర్<br>సెల్ : 9032258913 | రమేష్<br>నరసరావుపేట రూరల్ రిపోర్టర్<br>సెల్ : 7075942600 | "నేటి దినపత్రిక సూర్య"<br>ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం.<br>9/1, అరండల్‌పేట, గుంటూరు. |